ఈనాడు
అల్లూరి సీతారామరాజు
ఆదివారం 20 అక్టోబరు 2024

పట్టుదలతో పైమెట్టుకు..



సబ్‌కలెక్టర్ కల్పశ్రీ స్ఫూర్తిప్రస్థానం

రంపచోడవరం, న్యూస్‌టుడే

చిన్నతనంలో ఆ బాలిక చదువుతున్న పాఠశాలలో ఓ వేడుకకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారిలాగే తాను కూడా కలెక్టర్ కావాలని ఆనాడే లక్ష్యం నిర్దేశించుకుందా బాలిక. తీవ్రంగా శ్రమించి విజయం సాధించింది.. అత్యున్నత పరీక్ష అయిన సివిల్స్‌లో సత్తా చాటింది.. ఆమే రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన కల్పశ్రీ సామాన్య కుటుంబంలో జన్మించి ఉన్నతస్థానానికి చేరి యువతకు ఆదర్శంగా నిలిచారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆమె 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు. తన ప్రస్థానాన్ని వివరించారు.

ఈనాడు ప్రత్యేకం

కుటుంబ నేపథ్యం

కర్ణాటక రాష్ట్రం తుంకూరు గ్రామానికి చెందిన కల్పశ్రీ తల్లిదండ్రులు రత్నమ్మ, కాంతిరాజ్. తండ్రి ఇంటర్ వరకు చదివి స్వస్థలమైన తుంకూరులో వీఆర్వోగా, ఆర్ఐగాను పనిచేసి పదవీవిరమణ పొందారు. తల్లి గృహిణి. వీరితో పాటు అక్క క్వాలిస్థి ఉపాధ్యాయినిగా, అన్నయ్య లక్ష్మీకాంత్ ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నారు. కల్పశ్రీ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి అభిషేక్‌గౌడను వివాహం చేసుకున్నారు. ఆయన కర్ణాటకలోని మాండ్యాకు చెందిన వారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టరుగా పనిచేస్తున్నారు.



కర్ణాటక రాష్ట్రం తుంకూరులో కుటుంబంతో సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

విద్యాభ్యాసం సాగిందిలా..

కర్ణాటక రాష్ట్రం తుంకూరుకు చెందిన కల్పశ్రీ 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. స్వస్థలంలో జవహర్ నవోదర విద్యాలయంలో ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ వరకు చదివారు. బెంగళూరులో ఎలక్ట్రానిక్స్ (కంప్యూటర్)లో ఇంజినీరింగ్‌ను పూర్తి చేశారు. ఇదే సమయంలో ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో స్వయంకృషితో ముందుకుసాగారు. నాలుగేళ్ల పాటు పట్టుదలతో చదివి సివిల్స్ పరీక్షల్లో ప్రతిభ చూపి ఐఏఎస్‌ను సాధించారు.



భర్త, జేసీ అభిషేక్ గౌడతో సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

శిక్షణ అనంతరం

కల్పశ్రీ 2022లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. తొలుత పల్నాడు జిల్లాలో శిక్షణ కలెక్టర్‌గా, అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. ఇటీవల మొదట పోస్టింగ్‌గా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా నియమితులయ్యారు. పట్టుదల, క్రమశిక్షణ, స్వయంకృషితో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చని యువతకు సందేశమిచ్చారు.



ప్రేమ పొంగేలా..!

సాధారణంగా బంగాళదుంపలు, వంకాయలు గుండ్రంగా, నిలువుగా ఉంటాయి. హుకుంపేటలోని రాజు కూరగాయల దుకాణంలో హృదయాకారం(లవ్ సింబల్)లో వంకాయ, దుంప కనిపించాయి. వీటిని పలువురు ఆసక్తిగా తిలకించారు.

– హుకుంపేట, న్యూస్‌టుడే



సమస్యల పరిష్కారానికి చొరవ

ఎమ్మెల్యే శిరీషాదేవి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 12 పంచాయతీల నుంచి వివిధ సమస్యలపై 161 వినతులను ప్రజలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి మండలంలోనూ సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. రోడ్లు, తాగునీరు తదితర సమస్యలపై నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు మరం విజయభాస్కర్, ఎంపీడీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, తెదేపా, భాజపా, జనసేన మండలాధ్యక్షులు గురుకు శేషకుమార్, రేవుల జానకిరెడ్డి, మళ్ల దుర్గాప్రసాద్, అధికారులు పాల్గొన్నారు. మారేడుమిల్లిలో ఎంపీడీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో పల్లె పండగ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యులు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి



పల్లె పండగలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి

జీవ వైవిధ్య సంరక్షణతో మేలు

పాడేరు, న్యూస్‌టుడే: జీవ వైవిధ్య సంరక్షణ చర్యలు చేపడితే రైతులకు మేలు జరుగుతుందని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. వాసన్, రెయిఫారెస్ట్ ఎలియన్స్, రైతు సాధికార సంస్థల ఆధ్వర్యంలో జీవ వైవిధ్యభరిత సుస్థిర వ్యవసాయం విధానాలు, భూ వనరుల యాజమాన్య పద్ధతులపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. భూమి క్షీణతకు సంబంధించిన సమస్యలు, సవాళ్లను అధిగమించాలన్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.800 కోట్ల వ్యవసాయ రుణాలు అందించినట్లు తెలిపారు. పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్, రంపచోడవరం ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్ నంద్, డ్వామా పీడీ శివయ్య, మురళి, నాబార్డ్ డీడీఎం చక్రధర్, సంస్థల ప్రతినిధులు, డీపీఎం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో జిల్లాస్థాయి అధికారులు

రాళ్లు పరిచి.. రాకపోకలకు వీలు చేసుకుని!

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం, గొర్రెలమెట్ట గ్రామానికి చెందిన గిరిజనులు శ్రమదానంతో కాలువపై పెద్దపెద్ద రాళ్లు పేర్చి అవతలి ఒడ్డుకు చేరేందుకు వీలు చేసుకున్నారు. ఉప సర్పంచి కోటిబాబు, వార్డు సభ్యుడు సింహాచలం మాట్లాడుతూ.. ఈ రెండు గ్రామాల మధ్య కాలువపై వంతెన నిర్మాణం చేపడతామని గతంలో చింతపల్లి వచ్చిన అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. తమ కష్టాలు తీరుతాయని ఈ ప్రాంత ప్రజలు ఆనందించారన్నారు. కాలువ అవతల చింతపల్లి, జి.మాడుగుల మండలాలకు చెందిన సుమారు 150 గ్రామాలు ఉన్నాయని చెప్పారు. వంతెన నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఉపయోగం లేకపోవడంతో అంతా కలిసి శనివారం శ్రమదానంతో తాత్కాలికంగా రాళ్లతో రాకపోకలకు వీలు చేసుకున్నామని పేర్కొన్నారు.



కాలువలో రాళ్లు పరుస్తున్న లక్ష్మీపురం గ్రామస్థులు

దళితులకు ఉచిత వెలుగులు

సౌర విద్యుత్తు వినియోగానికి ముందుకు వచ్చేవారికి పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిస్తున్నాయి. మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయగా మిగతా సొమ్ములు లబ్ధిదారులు పెట్టుబడి పెట్టుకోవాలి. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగానే సౌర విద్యుత్తును అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో డిస్కంలు వారీగా ఆయా వర్గాల లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు.. వారిలో ఎంతమంది సోలార్ విద్యుత్తుకు ఆసక్తి చూపుతున్నారో సర్వే చేయిస్తున్నారు.

- ఇళ్లకు సౌర విద్యుత్తు అందించేందుకు సన్నాహాలు
- వంద శాతం రాయితీతో సోలార్ పరికరాలు
- లబ్ధిదారుల గుర్తింపునకు ఈపీడీసీఎల్ సర్వే

ఈనాడు, అనకాపల్లి – న్యూస్‌టుడే, పాడేరు

తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలోని అయిదు ఉమ్మడి జిల్లాల్లో 7.22 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో రూఫ్‌టాప్ సోలార్ పరికరాలు ఏర్పాటుకు వీలుగా స్లాబ్ ఇళ్లు ఎంతమందికి ఉన్నాయో గుర్తిస్తున్నారు. సౌరపలకలు ఇంటి పైభాగంలో అమర్చాలంటే సుమారు 100 చ.అ విస్తీర్ణం అవసరం అవుతుంది. అలాంటి వారిని గుర్తించి ఈ విద్యుత్తు వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎస్సీల కంటే ఎస్టీ గృహ విద్యుత్తు కనెక్షన్లు ఎక్కువగా ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఎస్టీ లబ్ధిదారుల్లో చాలామంది పూరిళ్లు, పెంకుటిళ్లలోనే నివాసం ఉంటున్నారు. సోలార్ పరికరాలు అమర్చడానికి వీలులేని గృహాలే ఎక్కువగా ఉన్నాయి. మైదాన ప్రాంతంలోని ఎస్సీ లబ్ధిదారులున్నా వారిలో కూడా చాలామంది కాలనీల్లో ఉంటున్నారు. వారి ఇంటి పైకప్పులు సోలార్ పలకల ఏర్పాటుకు అనువుగా ఉండడం లేదు. దీంతో తక్కువ సంఖ్యలోనే ఉచిత సోలార్ విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటుకు అవకాశం ఉన్నట్లు ఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు.

ఈపీడీసీఎల్ పరిధిలో దళితుల విద్యుత్తు కనెక్షన్ల వివరాలు

ఉమ్మడి సర్కిల్	ఎస్సీలు	ఎస్టీలు
విజయనగరం	57,601	45,252
విశాఖపట్నం	37,693	1,22,865
రాజమహేంద్రవరం	1,54,821	59,196



వివరాలు తెలుసుకుంటున్న సిబ్బంది

ఇరుపక్షాలకూ లాభదాయకమే..

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వడం వల్ల ఇటు లబ్ధిదారులకు, అటు ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరనుంది. సౌర పలకలపై పెట్టిన పెట్టుబడితో ప్రభుత్వంపై మొదట కొంత ఆర్థిక భారం పడినా దీర్ఘకాలంలో విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు భారీగా మిగలనుంది.

✦ ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల లోపు వినియోగించేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నారు. ఈ విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు ఒక్కో యూనిట్‌పై సుమారు రూ.6 వరకు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. అదే సోలార్ ద్వారా ఉచితంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు విద్యుత్తును అందించగలిగితే ఇప్పటి విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు ప్రభుత్వానికి ఆదా అవుతుంది. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఎక్కువగా 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తుంటారు. ఒక కిలోవాట్ సోలార్ ఉపకరణాలు ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్తు సౌరశక్తి ద్వారా అందుబాటులోకి వస్తుంది. మిగతా 20 నుంచి 30 యూనిట్ల భారమే ప్రభుత్వంపై పడుతుంది.

✦ లబ్ధిదారులు సోలార్ విద్యుత్తుకు ముందుకు వస్తే అంతరాయాల్లేని సరఫరా అందుతుంది. సౌర పలకలకు పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఇళ్లలో వినియోగించే విద్యుత్తు కంటే సోలార్ ద్వారా ఎక్కువ విద్యుత్తు ఉత్పత్తి జరిగితే ఆ మిగులు కరెంటును డిస్కంకు తిరిగి అమ్మి సొమ్ము చేసుకోవచ్చు. ఒకసారి సోలార్ పలకలు ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా విద్యుత్తు అందుతుంది. 'ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల గుర్తింపు సర్వే పూర్తయింది, ప్రభుత్వం జారీచేయబోయే తదుపరి ఉత్తర్వులు కోసం చూస్తున్నామ'ని ఈపీడీసీఎల్ సీఎండీ ఇ.పృథ్వీతేజ్ తెలిపారు.

పర్యటక పండగొచ్చేసింది!

- ★ పెరిగిన సందర్శకుల తాకిడి
- ★ రిసార్టులు, హోటళ్లు సిద్ధం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: సహజసిద్ధమైన అందాలకు పాడేరు ఏజెన్సీ పెట్టింది పేరు. ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన అరకులోయతోపాటు బొర్రా గుహలు, లంబసింగి, వంజంగి మేఘాలకొండలు లాంటి ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఎన్నో ఇక్కడ ఉన్నాయి. ఈ ప్రాంతాలను సందర్శించేందుకు వేలాదిగా పర్యటకులు తరలివస్తుంటారు. ఈ ఏడాది సీజన్ మొదలుకావడంతో ఇప్పుడిప్పుడే సందర్శకుల తాకిడి పెరుగుతోంది.

సందర్శకులకు స్థానికంగా ఆతిథ్యం కల్పిస్తున్న రిసార్టులు, హోటళ్ల నిర్వహణపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ ఇటీవల ఆరా తీశారు. వసూలు చేస్తున్న ఛార్జీలకు తగ్గట్లుగా సౌకర్యాలు కల్పించాలని, ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని, హోటళ్ల వద్ద గదుల అద్దె వివరాలను ప్రకటించాలని పేర్కొన్నారు. క్యాంపింగ్ టెంట్లకు పంచాయతీ, విద్యుత్తు సంస్థల అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. స్థానిక గిరిజనులకే అనుమతి కల్పించాలని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీన అరకులోయలో హోటళ్లు, రిసార్టుల నిర్వాహకులతో పీవో సమావేశమై ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

★ బొర్రా గుహలు, అరకులోయ, వంజంగి మేఘాలకొండ, జలపాతాలు, తాజంగి, లంబసింగి వంటి ప్రముఖ ప్రదేశాల్లో రిసార్టులు, హోటళ్లు, అతిథి గృహాలకు మరమ్మతులు చేపడుతూ పర్యటకులకు అనువుగా సిద్ధం చేస్తున్నారు. పర్యటక శాఖ ఆధ్వర్యంలోని ఏపీ టూరిజం రిసార్టుల్లోనూ సదుపాయాలు మెరుగుపరుస్తున్నారు.



కొత్తపల్లి జలపాతంలో పర్యటకులు

అదనపు వసూళ్లపై ఆరా...



వంజంగి మేఘాలకొండకు వెళ్లే మార్గంలో సిద్ధమవుతున్న షెడ్లు

పాడేరు ఏజెన్సీలో పర్యటక సీజన్ సుమారు ఆర్నెల్లపాటు ఉంటోంది. ఆయా ప్రాంతాలను వేలాదిగా పర్యటకులు సందర్శిస్తుంటారు. ఇక్కడున్న సుందరమైన, ప్రకృతిసిద్ధ అందాలు, జలపాతాలు, ఇతర ప్రదేశాలను వీక్షించేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు పశ్చిమబెంగాల్, చెన్నై, ముంబయి ప్రాంతాల నుంచి వస్తుంటారు. వీరికి ఆతిథ్యం కల్పించేందుకు పర్యటక శాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో సరైన రిసార్టులు, హోటళ్లు, అతిథిగృహాలు అందుబాటులో లేవు. వీరంతా ప్రైవేటు హోటళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు రిసార్టులు, హోటళ్ల యాజమాన్యాలు సందర్శకుల నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నాయని ఆరోపణలున్నాయి. వసూలు చేస్తున్న రుసుంకు తగ్గట్లుగా సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం లేదని సందర్శకుల నుంచి అనేక ఫిర్యాదులున్నాయి. సాధారణంగా అన్ సీజన్‌లో రూ.వెయ్యికి దొరికే గదికి సీజన్‌లో రూ.2 వేల వరకూ వసూలు చేస్తున్నారు. వీటి నియంత్రణపై కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టి పెట్టారు.

ముంచెత్తిన ముల్లంగి



హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేటలో శనివారం నిర్వహించిన వారపు సంతకు ముల్లంగి అధికంగా వచ్చింది. ఈ కావిళ్లు అధికంగా రావడంతో వ్యాపారులు అత్యంత తక్కువ ధరలు చెల్లించి కొనుగోలు చేశారు. 40 కేజీలు ఉండే కావిడ కేవలం రూ.100 నుంచి రూ.150 వరకు ధర పలికింది. కూలీల డబ్బులు కూడా రాలేదని రైతులు వాపోయారు.

పోస్టుల భర్తీకి కసరత్తు



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న డీఈఓ పి.బ్రహ్మాజీరావు, విద్యాశాఖ అధికారులు

పాడేరు, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 37 బోధన, 5 బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరగా.. 436 మంది దరఖాస్తు చేసుకున్నారని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఈఓ అధ్యక్షతన ధ్రువపత్రాల పరిశీలన ప్రశాంతంగా జరిగింది. 80 శాతం పైగా అభ్యర్థుల ధ్రువపత్రాలను 12 కౌంటర్ల ద్వారా పరిశీలించారు. మిగిలిన అభ్యర్థులకు ఆదివారం పరిశీలన జరుగుతుందని డీఈఓ పేర్కొన్నారు. జీసీడీవో సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేకేలైన్‌లో విరిగిపడిన కొండచరియలు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తవలస- కిరండూల్ రైలు మార్గంలో శనివారం రాత్రి కొండచరియలు విరిగిపడ్డాయి. రైల్వే అధికారులు తెలిపిన సమాచారం మేరకు త్రైడా- చిమిడిపల్లి పరిధిలోని 59వ నంబర్ వద్ద వర్షాలకు కొండచరియలు విరిగి పడి పట్టాలపై పడ్డాయి. దీంతో కిరండూల్ పాసింజర్ రైలును చిమిడిపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపేశారు. సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

- ❖ కారును ఢీకొని లోయలోకి వెళ్లిన బస్సు
- ❖ క్షేమంగా బయటపడిన 42 మంది ప్రయాణికులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: డౌనూరు- మర్రిపాలెం మధ్యలో శనివారం మధ్యాహ్నం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 42 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. చింతపల్లి నుంచి నర్సీపట్నంకు ఆర్టీసీ బస్సు, దాని ముందు ఓ కారు వెళ్తోంది. డౌనూరు దాటిన తర్వాత మర్రిపాలెంకు దగ్గర్లో కారుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించడానికి డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశారు. వెనుకనే వస్తున్న ఆర్టీసీ బస్సు కారును తప్పించబోయి దానిని ఢీకొట్టి పక్కనే ఉన్న లోయలోకి వెళ్లిపోయింది. ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 42 మంది ప్రయాణికులకు పెద్ద ప్రమాదం తప్పింది. డౌనూరు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం ప్రభుదాసు, ఉపాధ్యాయులు సుధాకర్, గిరిబాబు, హరిదేవ్, జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, నేతలు రామకృష్ణ, ప్రసాద్, పోతురాజు, స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి సపర్యలు చేశారు. ప్రయాణికుల్లో జి.సంతోష్, జి.లక్ష్మి, జి.జ్యోత్స్నప్రియలకు గాయాలవగా.. వారిని ఉపాధ్యాయులు డౌనూరు పీహెచ్‌సీకి తరలించారు. వీరికి వైద్యాధికారి లలిత ప్రథమ చికిత్స చేశారు. నర్సీపట్నం డిపో అధికారులు బస్సును పొక్లెయిన్‌తో బయటకు తీయించారు. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని కొయ్యూరు ఎస్సై నాగార్జున తెలిపారు.



బస్సును బయటకు తీస్తున్న పొక్లెయిన్

మారని రాత.. తప్పని మోత!

అనంతగిరి, న్యూస్‌టుడే: మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు డోలీమోతలు తప్పడం లేదు. అనంతగిరి మండలంలోని గుమ్మ పంచాయతీ కర్రిగడ గ్రామానికి చెందిన బడ్నాయిని రాములమ్మ అనారోగ్యానికి గురైంది. మంచాన పడిన ఆమెను ఆసుపత్రికి తరలించడానికి కుటుంబసభ్యులు కాలి నడకన కొండ మార్గంలో అయిదు కిలోమీటర్ల మేర డోలీ మోతతో గుమ్మ వరకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఆటోలో శృంగవరపుకోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికైనా కర్రిగుడ గ్రామానికి మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని గ్రామస్థులు సన్యాసిరావు తదితరులు కోరుతున్నారు.



డోలీ మోతతో రోగిని ఆసుపత్రికి తరలిస్తున్న గిరిజనులు

గంజాయి జోలికి పోవద్దు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: యువకులు మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సీఐ ఎస్.సన్యాసినాయుడు అన్నారు. కింద్రలో శనివారం గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ, ఎస్సై నరసింహమూర్తి మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాల విక్రయం, రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయన్నారు. రాజవొమ్మంగిలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై ఎస్సై అవగాహన కల్పించారు.

ఆసనం.. విజయ శాసనం

జాతీయ స్థాయి యోగా పోటీల్లో పేట బాలుర సత్తా

ఆసనాల్లో...



పాయకరావుపేట, న్యూస్‌టుడే

యోగాసనాల్లో బుడతలు చిరుతలై విజృంభిస్తారు. పిట్టకొంచెం కూత ఘనం అన్న రీతిలో ప్రతి పోటీలోనూ పేట విద్యార్థులు సత్తా చాటుతున్నారు. శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లోనూ బంగారు పతకాలు సాధిస్తున్నారు. ఆసనమేస్తే పతకం ఖాయమనే స్థాయికి చేరుకున్నారు. చిన్నప్పటి నుంచి యోగాలో ఆరితేరి విజయాలు సొంతం చేసుకుంటున్నారు. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీలోనూ స్వర్ణం సాధించి తమకు తిరుగులేదని నిరూపించారు. దీన్ని పురస్కరించుకుని 'న్యూస్‌టుడే' అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

చదువుతో పాటు యోగాలోనూ యోగా గురువు సురేష్ వద్ద తర్ఫీదు తీసుకున్నారు. వీరంతా శరీరాన్ని విల్లులా, హరివిల్లులా అలవోకగా వంచేస్తారు. ఎంతటి కఠినమైన ఆసనమైనా చిటికెలో వేయడంలో దిట్టలు. వేదికపై వీరి విన్యాసాలు చూస్తే అబ్బురపడాల్సిందే. పోటీల్లో తమకు సాటిలేదని పతకాల సాధనతో సత్తా చాటుతున్నారు. విజయాల 'యోగం'పై వారి మాటల్లోనే...



ఔరా అనిపించేలా...

అమ్మానాన్నల ప్రోత్సాహం..



నా పేరు **గాడి సోమ సూర్యచరణ్.** ఆరో తరగతి చదువుతున్నా. యోగాలలో మెలకువలు ఔపాసన పట్టిన తర్వాత 2022 నుంచి పతకాలు సాధిస్తున్నా. తొలిసారి సౌత్‌జోన్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించా. జాతీయస్థాయి పోటీల్లో ఎనిమిదో స్థానం పొందాను. 2023లో తమిళనాడు చిదంబరంలో జరిగిన పోటీల్లో నాలుగో స్థానం, జాతీయస్థాయిలో ఐదో స్థానం వచ్చింది. విశాఖలో జిల్లా స్థాయి పోటీలో ప్రథమస్థానం, కర్నూలులో రాష్ట్రస్థాయి పోటీలో ద్వితీయస్థానంలో నిలిచా. తాజాగా తమిళనాడులో జరిగిన సౌత్‌జోన్ పోటీల్లో ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నా. ఇదే స్ఫూర్తితో సాధన చేస్తుంటా. యోగా సాధనలో అమ్మ రమణమ్మ, నాన్న వెంకటరమణమూర్తి ఎంతో ప్రోత్సహిస్తున్నారు.

పట్టు వదలకుండా..



ఆసనాలు వేయడమంటే చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. మూడో తరగతి చదువుతున్నప్పటి నుంచే పట్టు వదలకుండా నేర్చుకున్నా. ప్రస్తుతం జాతీయస్థాయిలో బంగారుపతకం సాధించా. ఇప్పటికే జిల్లాస్థాయిలో రెండు సార్లు ప్రథమస్థానం, రాష్ట్రస్థాయిలో వెండిపతకం సాధించా. గతేడాది గువహతీలో జరిగిన పోటీల్లో వ్యక్తిగత విభాగంలో ఐదో స్థానంలో నిలిచా. ఈ ఏడాది తమిళనాడు, గుజరాత్‌లో జరిగిన పోటీల్లో మా జట్టుకు బంగారుపతకం దక్కింది. ఇష్టంతో ప్రయత్నిస్తే ఏరంగంలోనైనా ముందంజలో ఉంటాం. ఆ మాటలే నాకు స్ఫూర్తిగా నిలిచాయి.
–చింతకాయల జయదీప్

అన్ని పోటీల్లో బహుమతులు

శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నా. రెండో తరగతి నుంచి పోటీల్లో పాల్గొంటున్నా. ఏ పోటీకి వెళ్లినా పతకం నాదే. ఇప్పటికే రెండు సార్లు జాతీయస్థాయికి అర్హత సాధించి బంగారు పతకాలు సాధించా. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పదికి పైగా పతకాలు సొంతం చేసుకున్నా. న్యూఢిల్లీ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లో జరిగిన పోటీలన్నింటిలోనూ బహుమతులు వచ్చాయి. ఇటీవలే మా బృందం సభ్యులు అండర్-14 విభాగంలో జాతీయస్థాయిలో బంగారుపతకం సాధించాం. శిక్షకుల పర్యవేక్షణలో మరింతగా రాణించాలన్నదే నా కోరిక. –బండారు దేవాన్ష్‌నాయుడు



చదువులోనూ చురుగ్గా..

ఆరంభంలో యోగా నేర్చుకునేందుకు ఇబ్బంది పడ్డా. రెండేళ్ల నుంచి పట్టు సాధించా. ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్నా. ఈ ఏడాది తమిళనాడు, గుజరాత్‌లో జరిగిన పోటీల్లో బంగారు పతకం సొంతం చేసుకున్నాం. యోగా అంటే అమ్మ, నాన్నకు చాలా ఇష్టం. యోగా కారణంగా చదువులోనూ చురుగ్గా ఉంటున్నాం. ఏకాగ్రత కుదురుతోంది. జాతీయస్థాయిలో యోగాలో మంచి పేరు తెచ్చుకుంటా.
–పినపాత్రుని సోహన్‌శ్రీ



అన్నింటా ముందంజలో..



యోగాసనాలతో పతకాలు సాధించడం ఒక్కటే కాదు. అన్నింటిలోనూ ముందంజలో ఉండేందుకు ఇది దోహదం చేస్తోంది. మానసికంగా దృఢత్వం వస్తోంది. రోజంతా ఉత్సాహంగా ఉండగలుతున్నాం. పోటీల్లో పాల్గొనడమే కాకుండా అందరూ రోజుకు గంట పాటు యోగా సాధన చేయాలి. విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే రెండు సార్లు జాతీయస్థాయిలో స్వర్ణ పతకాలు వచ్చాయి. తల్లిదండ్రులు, యోగా గురువు ప్రోత్సాహంతోనే ఇవి సాధ్యమయ్యాయి.– వీసం చైతన్య

ఆకుకూరలతో ఆరోగ్యం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఆకుకూరలతో ఆరోగ్యకరంగా ఉండొచ్చని సీడీపీవో నీలిమ అన్నారు. అరుకు పంచాయతీ నేరుడువలస అంగన్‌వాడీ కేంద్రంలో మునగ, కరివేపాకు ప్రాధాన్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆకుకూరలతో రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గుంటసీమ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పోషకాహార పంపిణీపై ఆరా తీశారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: మునగాకు వల్ల అనేక ప్రయోజనాలున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమహాలక్ష్మి అన్నారు. రాజేంద్రపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులు, బాలింతలకు శనివారం అవగాహన కల్పించారు. మహిళా పోలీసు భవానీ, కార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



నేరుడువలసలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో నీలిమ

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ఆటపాటలు, బొమ్మలతో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగించాలని జిల్లా సైన్సు అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. అటల్ టింకరింగ్ ప్రాజెక్టుపై ఈనెల 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు స్థానిక తలారిసింగి ఆశ్రమోన్నత పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. శనివారం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. తరగతి గదిలో విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న నాగేశ్వరరావు

మురిపించిన మంచు సోయగం

జి.మాడుగుల మండలం భీరం పంచాయతీ సలమరంగి గ్రామ సమీపంలోని కొండలపై మంచు సోయగాలు కనువిందు చేశాయి. శనివారం ఉదయం దట్టంగా పొగమంచు కురిసింది. ఎత్తయిన కొండల మధ్యలో మంచు పరచుకున్నట్లు ఉన్న దృశ్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. – జి.మాడుగుల, న్యూస్‌టుడే



సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కాఫీ తోటల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. అన్ని డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మెకు వెనకాడబోమని తెలిపారు. శనివారం ఏపీఎఫ్‌డీసీ డివిజనల్ మేనేజర్లు కృష్ణబాబు పాడేరు, రత్నదీపిక, మాజీ డీఎం మహేశ్వరరావుతో సంఘ నాయకులు చర్చలు జరిపారు. కూలి ధర పెంచాలని, హెల్పర్లను నియమించాలని, వేతనాలు పెంచాలని కోరారు. సమస్యలను రీజనల్ మేనేజర్ (ఆర్ఎం) దృష్టికి తీసుకెళ్తామని డీఎంలు తెలిపారు. కాఫీ కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కనకవల్లి, సుందర్రావు, హెల్పర్లు వెంకటేష్, రాజారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎఫ్‌డీసీ మేనేజర్లతో చర్చలు జరుపుతున్న కాఫీ కార్మిక సంఘం నాయకులు

పోడు పట్టాలు ఇవ్వాలని వినతి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బెన్నవరం పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని జనసేన నాయకులు బచ్చలి బొజ్జన్నదొర, గెమ్మెలి దాసు కోరారు. శనివారం అటవీ, విద్యుత్తు అధికారులను కలిసి సమస్యలు వివరించారు. పోతురాజుగున్నలు, కట్టువీధి, వట్టిబూసులు గ్రామాల్లో రైతులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని విన్నవించారు. గొచ్చపల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. జనసేన నాయకులు రాము, లింగేష్, కన్నయ్య, సాంబ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలో ఘన సంపద తయారీ కేంద్రాలన్నింటినీ పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని పలు పంచాయతీలను సందర్శించారు. లంబసింగి పంచాయతీలోని లబ్బంగి సంపద తయారీ కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న యంత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. లంబసింగి సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొట్లాటలో గాయపడిన గిరిజనుడి మృతి

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: జర్జుల గ్రామంలో ఇరువర్గాల దాడిలో గాయపడిన గిరిజనుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రవీంద్ర అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వంతినిభ బాబూరావు(49)కు అదే గ్రామానికి చెందిన కిల్లో రాధాకృష్ణ కుటుంబ సభ్యులతో ఈనెల 17న ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రాధాకృష్ణ క్రికెట్ బ్యాట్‌తో బాబూరావును కొట్టడంతోపాటు మరి కొంతమందిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాబూరావును ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం బాబూరావు మృతి చెందాడు. మృతుడి భార్య చీమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రైతుపై తేనెటీగల దాడి

కూనవరం, న్యూస్‌టుడే: మర్రిగూడేనికి చెందిన శ్రీమంతుల సతీశ్‌కుమార్ తన పొలంలో కూలీలతో పనులు చేయిస్తుండగా, ఒక్కసారిగా వచ్చిన తేనెటీగలు ఆయనపై దాడి చేశాయి. విషయాన్ని గుర్తించి కూలీలు ఆయనను దూరంగా తీసుకొచ్చేశారు. వెంటనే ఆయనను భద్రాచలం వైద్యశాలకు తరలించారు.


ముందు జాగ్రత్తలతో నష్టాల నివారణ

పాడేరు, న్యూస్‌టుడే: విపత్తుల సమయంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం వల్ల నష్టాలు నివారించవచ్చని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్యారోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఎండీపీడీఓలు, తహసీల్దార్లతో విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాల అమలుపై వర్క్‌షాపు నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ, డీఆర్‌ఓ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ మురళి, డీఎంహెచ్‌వో జమాల్ బాషా పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో యూనిసెఫ్ ప్రతినిధులు వెంకటేష్, నిర్మలారాణి, కాళేశ్వరరావు పాల్గొన్నారు.

'ప్రజా దర్బార్'లో వినతుల వెల్లువ

తెదేపా కార్యాలయంలో స్వీకరించిన మంత్రి లోకేశ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శనివారం విశాఖ తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన పలువురు మంత్రిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఎలాంటి ఆధారం లేని తమకు టిడ్కో ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజయనగరం జిల్లా బొద్దూరుకు చెందిన వావిలపల్లి హేమలత కోరారు. ఏపీ టూరిజం కార్పొరేషన్‌లో తనకు ఉద్యోగావకాశం కల్పించాలని వావిలపల్లి వేణుగోపాలరావు విజ్ఞప్తి చేశారు. 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని 1998 టీచర్స్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు. నాయీబ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలని విశాఖకు చెందిన దేవగుప్త రమేష్, మీసేవ, సీఎస్‌సీ సెంటర్ల లాగిన్ ఐడీని పునరుద్ధరించాలని విశాఖ గొల్లలపాలేనికి చెందిన కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమిని విక్రయించి తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విశాఖకు చెందిన ఆర్.లక్ష్మి, దివ్యాంగురాలైన తన కుమార్తెకు గత ప్రభుత్వం పింఛను నిలిపివేసిందని తిరిగి పునరుద్ధరించాలని పుక్కళ్ల అప్పలరాజు కోరారు.



తెదేపా కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

లోకేశ్.. మాపాలిట దేవుడు

తమ కుమారుడు వావిలపల్లి చైతన్యనాయుడిని ఇంటికి తిరిగి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్న మంత్రి నారా లోకేష్ తమ పాలిట దేవుడిలా నిలిచారని విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం సంతకవిటి మండలానికి చెందిన వావిలపల్లి వేణుగోపాలరావు, హేమలత దంపతులు తెలిపారు. ఈ మేరకు లోకేశ్ కలిసి ఆయన చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కూలిపనులు చేసుకుంటూ జీవించే వేణుగోపాలరావుకు ముగ్గురు అబ్బాయిలు. మూడో సంతానమైన చైతన్యనాయుడు బంధువుల ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. అనుకోని పరిస్థితుల్లో బంధువుల ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎన్ని ప్రయత్నాలు చేసిన ఆచూకీ తెలియలేదు. చివరికి విజయవాడలో జరిగిన ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా గాలించి హైదరాబాద్‌లో ఉన్న చైతన్యనాయుడిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. కుమారుడి రాకతో తమ కుటుంబం సంతోషంగా ఉందని, మంత్రి లోకేశ్‌కు రుణపడి ఉన్నామని తెలిపారు.



లోకేశ్‌ను కలిసిన వావిలపల్లి వేణుగోపాలరావు, హేమలత దంపతులు

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు

అడ్డతీగల, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బి.పద్మ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై వినోద్ శనివారం తెలిపారు. అడ్డతీగల మండలం కోనలోవకు చెందిన మామిడి లోవప్రసాదు స్థానికంగా కరెంట్ పనులు చేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన తిరగాటి రమేష్ పాత కక్షలతో 2020లో గొడ్డలితో లోవప్రసాదు తల వెనుక భాగంలో బలంగా నరకడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు రమేష్‌కి ఏడాది జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై వినోద్ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పీవీవీ ఎస్‌బీ రాజు వాదనలు వినిపించారన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు


డుంబ్రిగుడ: ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని సొవ్వా పంచాయతీ గొప్పులవలసలో ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం పుకలిలో శనివారం జరిగిన సంతకు డుంబ్రిగుడ మండలం గసభ పంచాయతీ గొందివలస గ్రామానికి చెందిన వంతాల శ్రీను బైక్‌పై వెళ్తున్నాడు. ఒడిశా నుంచి ఆంధ్ర వైపునకు మరో యువకుడు బైక్‌పై వస్తున్నాడు. గొప్పులవలస సమీపంలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. క్షతగాత్రులకు స్థానికులు సపర్యలు చేశారు. ఒడిశాకు చెందిన యువకుడిని ఒడిశా ఆసుపత్రికి, శ్రీనును అరకులోయ ఆసుపత్రికి తరలించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు ఉంటుందని ఎంపీడీఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. పోతంగి సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల చెంతకు చేరవేయాలన్నారు. గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రబీ విస్తీర్ణం పెంపునకు చర్యలు


చింతపల్లి, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో రైతులు రబీ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. శనివారం పరిశోధనాస్థానంలో వ్యవసాయశాఖకు సంబంధించి నెలవారీ శిక్షణ, క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమం జరిగింది. రబీలో రైతులు పండించాల్సిన పంటలు, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. రబీకి అనుకూలమైన వరి విత్తనాలను రాయితీపై రైతులకు పంపిణీ చేశారు. ఏడీఏ జాహ్నవి, ఏవోలు శ్రీనివాసరావు, మధుసూధనరావు ఉమాదేవి, శాస్త్రవేత్తలు డాక్టర్ బయ్యపురెడ్డి, బాలహుస్సేన్‌రెడ్డి, సందీప్‌నాయక్, జోగారావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఆర్, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ముంచంగిపుట్టు, పెదబయలు గ్రామీణం: దారెల పంచాయతీ పెదపేట గ్రామ సమీపంలో మత్స్యగెడ్డలో ఈ నెల 17న నాటుపడవ మునిగి గల్లంతైన యువకుడు కొర్రా వేణుగోపాలస్వామి మృతదేహం లభ్యమైంది. ఎస్డీఆర్ఎఫ్ బృందం శనివారం మత్స్యగెడ్డలో మృతదేహాన్ని వెలికితీసింది. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. వేణుగోపాలస్వామి స్వగ్రామం సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి మృతదేహాన్ని తరలించారు. తల్లిదండ్రులు భీమన్న, సీతమ్మ, భార్య లక్ష్మీ, బంధువులు బోరున విలపించారు. గాలింపు చర్యల్లో తహసీల్దార్లు నర్సమ్మ, రంగారావు, సీఐ వెంకటరావు, ఎస్సైలు రవీంద్ర, రమణ, ఎస్డీఆర్ఎఫ్ ఎస్సై వైకుంఠం, సర్పంచులు పాండురంగస్వామి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని వెలికితీస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.బాబు అన్నారు. శనివారం ఆయన అంతాడ, తాటిమానుపాలెం, బంగారంపేట గ్రామాల్లో పర్యటించారు. అక్కడి లబ్ధిదారులతో మాట్లాడారు. పీఎం జన్‌మన్ పథకంలో ఇటీవల ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ ఈనెల 31లోగా పనులు ప్రారంభించాలన్నారు. నిర్మాణానికి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఈ గోవింద పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబు

ఇంద్రధనస్సు విరిసె.. మనసు మురిసె


జి.మాడుగులలో..


డుడుమ జలపాతం వద్ద..

జి.మాడుగులలో, ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని డుడుమ జలపాతం వద్ద శనివారం ఇంద్రధనస్సు విరిసింది. పచ్చని కొండల నడుమ సప్తవర్ణాలతో హరివిల్లు కనువిందు చేసింది. ఈ అందాలను పలువురు తమ కెమెరాల్లో బంధించారు.
– ముంచంగిపుట్టు గ్రామీణం, జి.మాడుగుల, న్యూస్‌టుడే

మాచ్‌ఖండ్‌లో షూటింగ్ సందడి

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మాచ్‌ఖండ్ జల విద్యుత్కేంద్రం వద్ద శనివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. క్రిష్ దర్శకత్వంలో అనుష్కశెట్టి కథానాయికగా రూపొందిస్తున్న ఘాటీ సినిమా షూటింగ్ ఇక్కడ జరిగింది. అనుష్కశెట్టి, జాన్‌విజయ్, నాని తదితరులపై వించ్‌హౌస్, ప్రాజెక్టు ఆసుపత్రి వద్ద పలు సన్నివేశాలు చిత్రీకరించారు. జల విద్యుత్కేంద్రం టర్బయిన్‌ఫ్లోర్‌లో చిత్రీకరణకు రంగం సిద్ధం చేయగా.. ఎస్ఈ ఎ.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు అడ్డుకున్నారు.


దర్శకుడు క్రిష్‌తో ప్రాజెక్టు సిబ్బంది

జీఓ నం 3 పునరుద్ధరించాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో అరకులోయ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజనులకు ఇచ్చిన జీఓ నం 3 పునరుద్ధరణ హామీ నెరవేర్చాలని కాంగ్రెస్ నాయకులు చిన్నస్వామి డిమాండ్ చేశారు. జీఓ నం 3 అమలు కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం అరకులోయ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఫ్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. నాయకులు ప్రేంకుమార్, సోమేశ్వరరావు, కొర్ర రఘురాం, భీమారావు పాల్గొన్నారు.


ఎలా చదువుతున్నారు.. ఏం చేస్తున్నారు..?

ఇంటర్ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు

పాడేరు, న్యూస్‌టుడే

ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచి అధిక ఉత్తీర్ణత శాతం సాధించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కొత్తగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమలు చేయడానికి ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అల్లూరి జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్, 55 ప్రైవేటు, కేజీబీవీ కళాశాలలు కలిపి మొత్తం 75 కళాశాలలున్నాయి. వీటిలో ప్రథమ సంవత్సరం దాదాపు 7,900 మంది, ద్వితీయ సంవత్సరంలో సుమారు 7,300 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏటా కార్పొరేట్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంటోంది. ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం తక్కువగా ఉంటోంది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వం కొత్త విధానాలను ప్రవేశపెట్టింది. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల విధానం అమలుచేస్తున్నారు. విద్యార్థుల హాజరుతోపాటు వారు అంతర్గత పరీక్షల్లో సాధించిన మార్కుల వివరాలు ఈ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు చూపించి వారితో సంతకాలు చేయించి కళాశాలకు తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటర్‌లో నెలకు ఒకటి చొప్పున నాలుగు యూనిట్ టెస్ట్‌లు, ఒక త్రైమాసిక, ఒక అర్ధ సంవత్సర పరీక్షలతో పాటు ప్రీ ఫైనల్ పరీక్షలు రెండుసార్లు నిర్వహిస్తారు. ఇలా ఏడాదిలో ఎనిమిది పరీక్షలు జరుగుతాయి. వీటి ఫలితాలు ఈ కార్డుల్లో నమోదు చేస్తారు. ఇలా చేయడం వల్ల వెనుకబడిన విద్యార్థుల వివరాలు అధ్యాపకులు, తల్లిదండ్రులకు ముందుగానే తెలుస్తుంది. వారిని బాగా చదివించేందుకు అవకాశం ఉంటుంది. ఇలా చేయడం వల్ల ఉత్తీర్ణత శాతం పెరుగుతుంది. వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు తెల్ల రంగు, జనరల్ ప్రథమ సంవత్సరం చదివే వారికి లేత పసుపు రంగు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు లేత నీలం రంగుల్లో ఈ కార్డులు ముద్రిస్తున్నారు. విద్యార్థులు నెలలో ఎన్నిరోజులు కళాశాలకు వచ్చారనే వివరాలు కూడా ఇందులో పొందుపరుస్తారు. పిల్లలు సక్రమంగా కళాశాలకు వెళ్తున్నారా లేదా అన్నది తల్లిదండ్రులకు తెలుస్తుంది.


ప్రోగ్రెస్ కార్డు నమూనా


హుకుంపేట జూనియర్ కళాశాలలో ప్రోగ్రెస్ కార్డుల నమూనాలు చూపిస్తున్న అధ్యాపకులు

ముద్రణకు పంపుతున్నాం

ప్రోగ్రెస్ కార్డుల నమూనాలు వచ్చాయి. వీటిని ముద్రణకు పంపుతున్నాం. రాగానే ఈ ఏడాది నుంచి ఈ విధానం ప్రారంభిస్తాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధానం వల్ల విద్యార్థులు ఎలా చదువుతున్నారనేది తల్లిదండ్రులకు తెలుస్తుంది. తల్లిదండ్రులతో రెండు నెలలకు ఒకసారి కళాశాలలో సమావేశం నిర్వహిస్తాం.
– శ్రీనివాస్, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, హుకుంపేట

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అవకాశం

ఎటపాక, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న పట్టభద్రుల ఎన్నికలకు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఓటు నమోదు చేసుకోవాలని తెదేపా రంపచోడవరం ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్త శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు వేసిన అభ్యర్థులు మళ్లీ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారా, తహసీల్దారు కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రారంభమైందని తహసీల్దార్ సరస్వతి శనివారం తెలిపారు. 2021లో డిగ్రీ పూర్తిచేసిన ప్రతీ విద్యార్థి ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. వచ్చేనెల ఆరో తేదీ లోపు అర్హులైన వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారి అర్హత ధ్రువపత్రాలు నకళ్లతో, ఫొటోలు జతపర్చాలన్నారు.

అనంతగిరి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులంతా ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు రాంబాబు, మండల కార్యదర్శి సింహాచలం పిలుపునిచ్చారు. మండలంలోని పలు ప్రభుత్వ గిరిజన, ఉన్నత పాఠశాలల్లో యూటీఎఫ్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు చేయించారు. వచ్చే నెల ఆరు వరకు దీనికి గడువు ఉందన్నారు. సంఘ నాయకులు మల్లేశ్వరరావు, దయానిధి, సుబ్బారావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అ·వీ·ఇ·వీ

సత్యసాయి శోభాయాత్ర నేడు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: భగవాన్ సత్యసాయిబాబా అవతార ప్రకటన సందర్భంగా ఆదివారం శోభాయాత్ర నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రింతాడ నుంచి చింతపల్లి డిగ్రీ కళాశాల వరకు ఈ యాత్ర ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కళాశాల రోడ్డులో మద్యం దుకాణాలు వద్దు

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి ప్రభుత్వ డైట్ కళాశాల వరకు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ల బొజ్జిరెడ్డి, మండల భాజపా నాయకులు కె.ఎల్.ఎన్ గురుప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీలకు వినతిపత్రాలు పంపించారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటుచేస్తే పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఏరియా ఆసుపత్రి వెళ్లే రోగులకు, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే ప్రయాణికులకు, బ్యాంకులకు వెళ్లే వారికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

బియ్యం సక్రమంగా రవాణా చేయాలి

కూనవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలకు రెవెన్యూ అధికారులు సక్రమంగా బియ్యం రవాణా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య కోరారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముల్లూరు నుంచి బొజ్జరాయిగూడెం వరకు ఉన్న పాఠశాలలకు మూడు నెలలుగా బియ్యం ఇవ్వడంలేదన్నారు. దీంతో భోజనాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెంటయ్య, అమ్మాజీ, నాగమణి, వెంకమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా అప్పారావు

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక మండల వెలుగు విభాగం ఏపీఎంగా అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన రంపచోడవరం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన స్వామి రంపచోడవరం ఏపీఎంగా బదిలీపై వెళ్లారు.

గంగవరంలో అన్నసమారాధన

గంగవరం, న్యూస్‌టుడే: స్థానిక రాజరాజేశ్వరి ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 1000 మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, కమిటీ సభ్యులు అబ్బాయిదొర, కిషోర్, రమేష్, బుల్లిదొర, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత తప్పనిసరి

నెల్లిపూడి,(గంగవరం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు విధిగా పరిసరాలు పరిశుభ్రత పాటించాలని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. నెల్లిపూడిలో శనివారం సచివాలయం, వైద్య సిబ్బందిచే దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కేవైసీ నమోదుకు ఇబ్బందులు తగవు

పాడేరు: ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో రూ.200 పెట్టి గ్యాస్ పైపు కొనుగోలు చేస్తేనే ఈ-కేవైసీ చేస్తామని నిర్వాహకులు చెప్పడం విడ్డూరంగా ఉందని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పల్లె పండగతో సమగ్రాభివృద్ధి


ఎటపాకలో పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాస్ తదితరులు


డుంబ్రిగుడ మండలం లివిటిపుట్టులో..

ఎటపాక, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగతో గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమని తెదేపా అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్ అన్నారు. ఎటపాక గ్రామంలో శనివారం అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉన్నారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. సర్పంచి కారం వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, మాదినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ.30 లక్షల అంచనాలతో 12 పనులు మంజూరయ్యాయి. మోతుగూడెం ప్రధాన ఆర్అండ్‌బీ రహదారి నుంచి పశువుల ఆసుపత్రి వరకు 450 మీటర్ల మట్టి రహదారి నిర్మాణ పనులను సర్పంచి ఆకేటి సీత, ఎంపీటీసీ సభ్యుడు వేగి నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి గుంపెనపల్లి మోహన్‌రావు, వార్డు సభ్యురాలు మల్లూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అన్నారు. అరమ, పోతంగి, కొల్లాపుట్టు పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమం శనివారం జరిగింది. సర్పంచి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, కూటమి నాయకులు స్వామి, ఆనంద్, చినగెన్ను, సింహాద్రి, ఏపీఎం సూరిబాబు పాల్గొన్నారు. లక్ష్మీపురం పంచాయతీలోని అర్లోయిపుట్టులో అభివృద్ధి పనులకు సర్పంచి కె.త్రినాథ్, ఏపీఓ సంగంనాయుడు శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తమ్మంగుల పంచాయతీ సుద్దగరువులో పలు నిర్మాణ పనులకు సర్పంచి లక్ష్మయ్య, తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు, జనసేన నాయకులు బుజ్జిబాబు, వంతల భీమన్న తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంతో సాగునీటి సమస్య తొలగనుందని జీకేవీధి సర్పంచి సుభద్ర అన్నారు. నక్కలమెట్టలో శనివారం చెరువు పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఉప సర్పంచి రాంబాబు, ఈవోపీఆర్డీ పాపారావు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, కూటమి నేతలు కొయ్యం బాలరాజు, గొర్లె వీరవెంకట్, జోగిరాజు, కొర్ర బలరాం, ముక్కలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.


నక్కలమెట్టలో చెరువు పనులు ప్రారంభిస్తున్న సర్పంచి, అధికారులు



ఆదమరిస్తే అంతే సంగతులు

పెదబయలు నుంచి పాడేరు వెళ్లే మార్గంలో కిత్తుకొండ- పన్నెడకు మధ్యలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం జరిగే ముప్పు ఉంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డు గానీ, తాత్కాలిక కంచె గానీ లేవు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.
– పెదబయలు, న్యూస్‌టుడే

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం తహసీల్దార్‌గా **అల్లు సత్యనారాయణ** శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన రాజవొమ్మంగి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కృష్ణజ్యోతి ఏలూరు జిల్లా పెదపాడు మండల తహసీల్దారుగా బదిలీ అయ్యారు. ఆర్ఐ జిలానీ, తోటి సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక తహసీల్దార్‌గా **కారం సుబ్బారావు** బాధ్యతలు చేపట్టారు. మారేడుమిల్లి నుంచి ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో వరరామచంద్రపురం డీటీగా, ఇన్‌ఛార్జి తహసీల్దారుగా, ఎటపాక డీటీగా సుబ్బారావు పనిచేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు, న్యూస్‌టుడే: పి.ఎం.ఆర్.సి.లో అకడమిక్/శిక్షణ అధికారి, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి, మహిళా అభివృద్ధి అధికారి పోస్టుల్లో డిప్యుటేషన్ పద్ధతిపై పనిచేయడానికి ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ తెలిపారు. 30వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

మహిళల అభ్యున్నతికి చర్యలు


వెలుగు, జీసీసీ అధికారులతో పీవో సింహాచలం సమీక్ష

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో వన్‌ధన్ వికాస్ కేంద్రాలను అభివృద్ధి చేస్తామని ఐటీడీఏ పీవో సింహాచలం పేర్కొన్నారు. తన ఛాంబర్‌లో జీసీసీ డివిజనల్ మేనేజర్ పార్వతీశ్వరరావు, వెలుగు డీపీఎం అపర్ణ, ఏపీఎంలతో పీవో శనివారం సమీక్ష నిర్వహించారు. పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. వెయ్యి మంది మహిళలను గుర్తించి వీరికి శిక్షణను ఇచ్చి అభివృద్ధికి వెలుగు, జీసీసీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పసుపు, చింతపండు, చీపుర్లు, జీడిపిక్కలు, జాప్రాలు తదితర అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, ఏపీఎంలు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతంలో విద్యుత్తు వెలుగులు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కొత్తపల్లి జలపాతంలో రాత్రి సమయాల్లో విద్యుత్తు కాంతులు ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. కొత్తపల్లి జలపాతాన్ని శనివారం రాత్రి సందర్శించారు. పరిసరాలతోపాటు జలపాతం వద్ద విద్యుత్తు దీపాల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలన్నారు. జలపాతం వద్ద రంగు రంగుల విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి సమయాల్లో పర్యటకులు ఈ ప్రాంతాన్ని సందర్శించేలా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.


కొత్తపల్లి జలపాతంలో విద్యుత్తు దీపాలు పరిశీలిస్తున్న పీవో తదితరులు

అటవీ అనుమతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు


పంప్డ్ స్టోరేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో వెంకట నరసింహమూర్తి, ఎస్ఈ తదితరులు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు అటవీ అనుమతుల మంజూరుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఎఫ్‌వో వై.వెంకటనరసింహమూర్తి తెలిపారు. శనివారం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు అవసరమైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఇన్‌టెక్ డ్యాం, జలవిద్యుత్కేంద్రం నిర్మించే ప్రదేశాలు చూశారు. ఇంజినీర్లతో సమావేశమయ్యారు. ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ అప్పలనాయుడు, రేంజి అధికారి వెంకటరావు, ఉప రేంజి అధికారి సింహాచలంపడాల్ పాల్గొన్నారు.

★ జాతీయ ఉపాధి పథకంలో భాగంగా సీలేరులో నర్సరీలు ఏర్పాటు చేయాలని డీఎఫ్‌వో ఆదేశించారు. శనివారం సాయంత్రం సీలేరు రేంజి పరిధిలో పలు ప్రాంతాలను సందర్శించారు. సీలేరులో నర్సరీ ఏర్పాటు చేసి సుమారు 80 వేల మొక్కలను పెంచాలని ఆదేశించారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలం దొరచింతలపాలెంలో గర్భిణి పల్లాల శివకుమారిని శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పురిటినొప్పులు తీవ్రమయ్యాయి. కుటుంబసభ్యులు 108కు సమాచారం అందజేశారు. అయితే గ్రామానికి సుమారు కిలో మీటరు వరకు రోడ్డు సరిగా లేకపోవడంతో స్పిన్‌బోర్డు సాయంతో కాలినడకన గర్భిణిని వాహనం వరకు తీసుకొచ్చారు. నొప్పులు తీవ్రం కావడంతో వాహనంలో ఈఎంటీ ప్రేమ్‌కుమార్, పైలట్ ఆదిరెడ్డి ప్రసవం చేశారు. శివకుమారి మగబిడ్డ జన్మనిచ్చింది. మెరుగైన వైద్యం కోసం తల్లీబిడ్డలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చేర్చారు.


గర్భిణిని తరలిస్తున్న 108 సిబ్బంది

రూ.79 లక్షలతో విద్యుత్తు సౌకర్యం

అనంతగిరి, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా అనంతగిరి మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో రూ.79 లక్షలతో విద్యుత్తు సౌకర్యం కల్పించామని పాడేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని చిన్నకోనల, బూరుగు, సిమిడివలస, రాయపాడు, డింజనవలస, బుంగిజా, పేదవలస గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించామన్నారు.

పిడుగుపాటుకు ఆవు, దూడ మృతి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మండలంలో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలతో భారీ వర్షం కురిసింది. పిడుగుపాటుకు గెమ్మెలి పంచాయతీ గొడుగురాయిలో వి.పిన్నంనాయుడికి చెందిన ఆవు, దూడ మృతి చెందాయి. మేతకు వెళ్లిన పశువులు ఇంటికి వచ్చి విద్యుత్తు స్తంభం వద్ద నిల్చున్నాయి. పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. నష్ట పరిహారం అందించాలని బాధిత రైతు కోరారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జీకేవీధి మండలంలో శనివారం తెరిపిలేకుండా వర్షం కురిసింది. జనజీవనం స్తంభించింది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షంతో రాజ్‌మా చిక్కుళ్ల పంటకు మేలు జరుగుతుందని గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

హుకుంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు సక్రమంగా వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో జమాల్ బాషా పేర్కొన్నారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. స్థానిక ఆసుపత్రిని శనివారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వైద్యసేవలపై రోగులను ఆరా తీశారు. అనంతరం బారాపల్లి గ్రామంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. టీబీ రోగులు పోషకాహారం తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది జమ్మి, సుశీల, గాయత్రి, టీబీ సూపర్‌వైజర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా, సిబ్బంది


ఉద్యాన పంటల క్షేత్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి, ఏపీఓ తదితరులు

ఉపాధి పథకంలో ఉద్యాన పంటల అభివృద్ధి

చింతపల్లి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆశాజ్యోతి అన్నారు. శనివారం ఆమె ఏపీఓ లక్ష్మీనారాయణమూర్తితో కలిసి చౌడుపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఉపాధి పథకంలో చేపట్టిన పండ్ల తోటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. గృహనిర్మాణాలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది రమణ, ఈసీ మధు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు చిన్నారి తరలింపు

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కోనాపురం పంచాయతీ చప్పాడి గ్రామంలో వంతల వెంకటరావు కుమార్తె సాంబ (1) న్యుమోనియాతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం కోసం చిన్నారిని కేజీహెచ్‌కు తరలించారు. సర్పంచి అప్పలమ్మ, వైద్య సహాయకుడు లక్ష్మణరావు, ఏఎన్ఎం సంధ్య, సన్యాసమ్మ, తెదేపా నాయకులు ఆనందరావు పాల్గొన్నారు.


108 వాహనంలో చిన్నారిని తరలిస్తున్న సిబ్బంది

గంగవరం, న్యూస్‌టుడే

?: స్థానిక ఆశ్రమబాలికోన్నత పాఠశాల వద్ద చెరువు మురుగుతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారింది. వసతి గృహంలో విద్యార్థులకు, స్థానికులకు చాలా ఇబ్బందిగా ఉంది. వసతి గృహానికి సరైన మురుగు నీటి వ్యవస్థ లేక ఈ చెరువులోనికి మురుగునీరు వదిలేస్తున్నారు. –కుంజం సిద్ధు, గంగవరం

✓: అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. వసతిగృహంలో డ్రైన్ ఏర్పాటుచేసి విద్యార్థులకు, స్థానికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. – కట్టా సింహాచలం, ఐటీడీఏ పీవో రంపచోడవరం



విద్యుత్తు ఉచ్చులు అమర్చడం నేరం

మోతుగూడెం, న్యూస్‌టుడే: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ మంగంపాడు వారపుసంతలో డొంకరాయి పోలీస్ స్టేషన్ ఎస్సై శివకుమార్ అక్రమ విద్యుత్తు ఉచ్చులపై గ్రామస్థులకు శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గ్రామస్థులతో మాట్లాడుతూ... అక్రమంగా, అనధికారికంగా విద్యుత్తు ఉచ్చులు అమర్చడం చట్టప్రకారం నేరమన్నారు. అటవీ ప్రాంతాల్లో, పంట పొలాల్లో విద్యుత్తు ఉచ్చులను వేస్తే జైలు పాలవుతారన్నారు. మంగంపాడు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వనజ, విద్యుత్తు లైన్‌మేన్ నీలంరెడ్డి విద్యుత్తు తీగల ఉచ్చుల వల్ల జరిగే నష్టాలను గ్రామస్థులకు వివరించారు. మంగంపాడు గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్సై శివకుమార్ శనివారం గంజాయిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి రవాణా, విక్రయించటం, సాగు చేయడం వంటి సమాచారం తెలిస్తే తక్షణమే 9381123100 నెంబర్ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.


మంగంపాడు వారపుసంతలో మాట్లాడుతున్న ఎస్సై శివకుమార్

రహదారిపై గండి పూడ్చివేత

కూనవరం, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదలు, వర్షాలకు ముల్లూరులో పంట పొలాలకు వెళ్లే మార్గంలోని రహదారికి గండి పడింది. దీనిని పూడ్చాలని గ్రామస్థులు అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జమాల్‌ఖాన్‌ను రైతులు కలిశారు. సమస్యను ఆయనకు వివరించడంతో స్పందించి తన సొంత ఖర్చులతో రహదారికి పడిన గండిని పూడ్చివేశారు.

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక - కన్నాయిగూడెం ప్రధాన రహదారిపై పెద్ద గుంతల కారణంగా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల అభ్యర్థన మేరకు తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలానికి సంబంధించిన అధికారులు గుంతలు పూడ్చారు. దీంతో కొంతమేర ప్రమాదాలు తప్పుతాయని స్థానికులు చెబుతున్నారు.


గండి పూడ్చే పనిలో స్థానికులు